సాక్షి మంచిర్యాల

శుక్రవారం, 4, అక్టోబర్, 2024

సదరం వైద్య శిబిరాలు

పాతమంచిర్యాల: ఈ నెల 7 నుంచి 28 వరకు సదరం వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీవో ఎస్.కిషన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైకల్య నిర్ధారణ పరీక్షలకు హాజరు కావాలని పేర్కొన్నారు. శారీరక వికలాంగులను 7, 18, 23, 28న 70మంది, 16న మూగచెవుడు సమస్యలు గలవారికి 50 మంది, 22న మానసిక వికలాంగులు 50 మంది, 25న కంటిచూపు సమస్యలున్న 40 మందికి వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు.



బెటాలియన్‌లో ముగిసిన పోటీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లోని పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ కానిస్టేబుళ్లకు నిర్వహిస్తున్న పోలీస్ స్పోర్ట్స్ మీట్ పోటీలు గురువారం ముగిశాయి. విజేతలకు కమాండెంట్ వెంకటరాములు బహుమతులు అందజేశారు.

గరిష్టం/కనిష్టం
35.0 /26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాయువ్యం దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

న్యూస్‌రీల్

ధాన్యం సేకరణకు సిద్ధం చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారిలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో ధాన్యం సేకరణ ప్రక్రియ, డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ వరిధాన్యం కొనుగోలు కేంద్రాల కార్యాచరణ రూపొందించాలని, రైస్‌మిల్లుల సామర్థ్యం మేరకు ధాన్యం కేటాయించాలని తెలిపారు. డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. డీసీపీ భాస్కర్, జి ల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఆర్‌డీవో కి షన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్ర హ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా వ్యవసా య అధికారి కల్పన, జిల్లా విద్యాధికారి యా దయ్య, జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి, మార్కెటింగ్ అధికారి షహబొద్దీన్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీటీసీపీ అధికారి బి.సంపత్, నీటి పారుదల శాఖ ఏఈలతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్లాట్ల భౌగోళిక స్థితిని పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. నిషేధిత, ప్రభుత్వ భూములు, చెరువు శిఖం, వాగుల భూముల్లోని ప్లాట్ల దరఖాస్తులను తిరస్కరించాలని తెలిపారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి




సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

కాసిపేట: ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టు సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండలంలోని లంబాడితండా(కె) గ్రామ పంచాయతీలో సర్వే ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒక కుటుంబానికి ఒకే కార్డు ఉంటుందని, ప్రతీ సభ్యుడికి ఒక ప్రత్యేక నంబర్ కేటాయిస్తారని తెలిపారు. ఎంపీడీఓ సత్యనారాయణసింగ్, ఎంపీఓ షేక్ సబ్దర్‌అలీ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆర్డీవో పరిశీలన

దండేపల్లి: మండలంలోని అల్లీపూర్ గ్రామంలో డిజిటల్ కార్డు సర్వేను ఆర్డీవో రాములు గురువారం పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి, ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో విజయ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ప్రతిభను గుర్తించేందుకే పోటీలు



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: పోలీసు అధికారులు, సిబ్బంది ప్రతిభను గుర్తించేందుకే పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆవరణలో కాళేశ్వరం జోన్ స్థాయి పోటీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ఎగ్గడి భాస్కర్, అడిషనల్ డీసీపీ రాజు, ఎస్బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏసీపీలు వెంకటస్వామి, మల్లారెడ్డి, ప్రతాప్, సురేంద్ర, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, సంపత్, మల్లేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి

మంచిర్యాలక్రైం: ప్రశాంత వాతావరణంలో దుర్గాదేవి నవరాత్రోత్సవాలు జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. గురువారం కమిషనరేట్ ఆవరణలో దేవీ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేశారు. కమిషనరేట్ పరిధిలో 566 విగ్రహాలను నెలకొల్పారని తెలిపారు.

వర్షం.. సాధారణమే..!



అలస్యంగా నాటు వేసుకోవడంతో ఎదిగే దశలో ఉన్న వరిపంట



నెన్నెలలో పత్తికి ఎరువులు వేస్తున్న రైతు

- వెనుదిరిగిన నైరుతికాలం
- 15 మండలాల్లో సాధారణం, 3 మండలాల్లో అధికం
- ఈశాన్య రుతుపవనాలు కరుణిస్తేనే వరి దిగుబడి
- ఎండల తీవ్రతతో పంటలకు ముప్పు

జిల్లాలో వర్షపాతం, కురిసింది(మిల్లీమీటర్లు)

నెల	సాధారణ వర్షపాతం	కురిసింది	లోటు/అధికం(శాతంలో)
జూన్	167.0	117.3	30 లోటు
జూలై	310.6	452.2	46 అధికం
ఆగస్టు	292.9	190	35 లోటు
సెప్టెంబర్	168.0	232.2	39 అధికం
మొత్తం	938.4	993.1	06 అధికం

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్ ముగిసి నాలుగు నెలల నైరుతికాలం వెనుదిరిగింది. గత కొద్ది రోజులుగా రుతు పవనాల నిష్క్రమణతో ఎండ దంచి కొడుతోంది. ఈ ఏడాది సాధారణ వర్షపాతం సగటున అధికంగా నమోదైనా కీలకమైన సమయంలో వర్షాలు ముఖం చాటేశాయి. జూన్ రెండో వారం నుంచి తొలకరి వర్షాలు మురిపించాయి. జూలై 18 నుంచి 28 వరకు ఎడతెరిపిలేని భారీ వర్షాలు కురువడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. జలాశయాల్లోకి భారీగా వరద నీరు చేరింది. పంటలు ఎదిగే, పూతకు వచ్చే కీలకమైన సమయం ఆగస్టులో ఆశించిన వర్షాలు లేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సెప్టెంబర్ మొదటి వారంలో భారీ వర్షాలు ముంచెత్తడంతో పంటలు నీటమునిగాయి. జిల్లా సగటున 6శాతం అధిక వర్షపాతం నమోదైంది. 15 మండలాల్లో సాధారణ వర్షపాతం, మరో మూడు మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. గతేడాది కంటే ఈ ఏడాది భూగర్భజలాలు 3శాతం పైకి వచ్చాయి. ప్రస్తుతం రుతు పవనాలు వెనుదిరగడం, గరిష్ట ఉష్ణోగ్రతలు గత నాలుగు రోజులుగా 36 డిగ్రీల నుంచి 38 డిగ్రీలకు చేరాయి. వాతావరణ మార్పులతో ఎండలు మండుతుండడంతో ఆలస్యంగా ఆగస్టు నెలాఖరులో వరి నాట్లు వేసిన రైతులు నీటితడులకు ఆందోళన చెందుతున్నారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కురిసే వర్షాలపైనే ఆశలు పెట్టుకున్నారు.

3.16 లక్షల ఎకరాల్లో సాగు..

ఈ ఏడాది సాధారణ సాగు విస్తీర్ణం 3.42 లక్షల ఎకరాలు ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. 1,54,507 ఎకరాల్లో పత్తి, 1,57,671 ఎకరాల్లో వరి సాగైంది. పప్పుదినుసులు, మొక్కజొన్న ఇతరత్రా పంటలు 5 వేల ఎకరాల్లో సాగయ్యాయి. జిల్లాలో ప్రధానంగా పత్తి పంట సాగు తగ్గించి వరిసాగు పెరగడం గమనార్హం. సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలతోనే వరిసాగు విస్తీర్ణం పెరిగింది. పప్పు దినుసుల సాగుపై మొగ్గు చూపలేదు. వరి సాగు గతేడాది కంటే 5 వేల ఎకరాలు పెరిగింది. దొడ్డురకం వరిసాగు తగ్గించి సన్నరకం సాగు చేసుకున్నారు. సన్నరకం వడ్లకు బోనస్ ప్రకటించడంతో ప్రాధాన్యత ఇచ్చారు.

జూలై, సెప్టెంబర్‌లోనే భారీ వర్షాలు..

వర్షపాతాన్ని బట్టి ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణంలో తేడాలు ఉంటాయని వ్యవసాయ శాఖ భావించింది. వర్షాల మధ్య ఎడబాటుతో అనుకూలంగా కురవకపోవడంతో ప్రణాళికకు అనుగుణంగా పంటలు సాగు చేసుకోలేదు. జూన్ చివరి నుంచి జూలై నెల 20 రోజులపాటు వర్షాలు లేక చిరుజల్లులకే పరిమితమైంది. దీంతో వరి నారు ముదిరిపోయింది. పంటలు ఎదిగే సమయంలో వర్షాల్లేక మొక్కలు వడలిపోయాయి. సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలు పంటలకు జీవం పోశాయి. ఈ వర్షాలతోనే రైతులు వరినాట్లు వేసుకున్నారు. మొత్తంగా నాలుగు నెలల కాలంలో జూలైలో వారం రోజులపాటు ఎడతెరిపిలేని భారీ వర్షాలు, సెప్టెంబర్ 1 నుంచి 8 వరకు మూడు, నాలుగు సార్లు మాత్రమే భారీ వర్షాలు కురిసాయి. ఈ సమయంలో కురిసిన భారీ వర్షాలతోనే ప్రాజెక్టులు, చెరువుల్లోకి భారీగా వరద నీరు చేరింది.

జిల్లాలోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు(మీటర్లలో)

ప్రాజెక్టు	నీటి సామర్థ్యం	ప్రస్తుత నీటిమట్టం
గొల్లవాగు	155.50	153.42
నీల్వాయి	124	124
ర్యాలీవాగు	151.50	150.10

అల్లీపూర్ చెరువు శిఖం కబ్జా

- సర్వేలో వెలుగులోకి ఆక్రమణలు
- ఆక్రమణదారులకు అధికారుల నోటీసులు



చెరువు శిఖంలో పంటసాగు

దండేపల్లి: మండలంలోని అల్లీపూర్ చెరువు శిఖం భూమి కబ్జాకు గురైంది. శిఖం భూమి ఆక్రమణలపై పలువురు చేసిన ఫిర్యాదు మేరకు అధికారులు చేపట్టిన సర్వేలో కబ్జా వెలుగులోకి చ్చింది. చెరువు ఆక్రమణకు గురవుతోందని గ్రామస్తులు గతంలో తహసీల్దార్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆక్రమణలపై దృష్టి సారించలేదు. దీంతో కొందరు శిఖం భూమి కబ్జా చేసి పంటలు సాగు చేశారు. గ్రామస్తులు ఇటీవల మరోమారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గత నెల 23న జిల్లా సర్వేయర్ శ్రీనివాస్ ఇరిగేషన్, రెవెన్యూ పోలీసు శాఖల సహకారంతో సర్వే చేశారు. రెండ్రోజుల క్రితం సర్వే పూర్తయింది. గ్రామ శివారులోని సర్వేనంబర్ 100లో చెరువు ఉంది. పూర్తి విస్తీర్ణం 59.39 ఎకరాలు కాగా.. చెరువును ఆనుకుని ఉన్న పలువురు రైతులు కొంత కబ్జా చేసినట్లుగా సర్వేలో తేలింది. 8.31ఎకరాల భూమి కబ్జాకు గురైనట్లు అధికారులు తేల్చారు. ఇందులో ఓ రైతు ఏకంగా మూడెకరాలు, మరికొందరు రైతులు ఐదు నుంచి పది గుంటలు వరకు కబ్జా చేసినట్లు సమాచారం. మండలంలోని పెద్దపేట చెరువు సమీపంలో ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఓ పట్టాదారుడు ఎలాంటి అనుమతి లేకుండా మట్టి పోసినట్లు కూడా సర్వే అధికారులు గుర్తించారు. అతడికి కూడా నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

21 మందికి నోటీసులు..

అల్లీపూర్ చెరువు శిఖం 8.31 ఎకరాలు కబ్జాకు గురైనట్లు సర్వే అధికారులు తేల్చారు. ఇందుకు సంబంధించిన 21 మంది రైతులకు నోటీసులు జారీ చేశాం. త్వరలో ఆ భూమిని స్వాధీనం చేసుకోవడంతోపాటు కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాం.

– సంధ్యారాణి, తహసీల్దార్, దండేపల్లి

మార్కెట్‌లో ఆక్రమణల తొలగింపు



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న జేసీబీ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో దుకాణాల ముందు ఆక్రమణలను మున్సిపల్ అధికారులు గురువారం కూల్చివేశారు. డీఎఫ్‌వో వాటర్‌ట్యాంకు రోడ్డు నుంచి అర్చన టెక్స్ చౌరస్తా మీదుగా జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వరకు నిబంధనలు అతిక్రమించి చేపట్టిన కట్టడాలను తొలగించారు. మరికొన్నింటిని తొలగించుకునేందుకు దుకాణ యజమానులకు ఒక్కరోజు గడువు ఇచ్చారు. ఇటీవల మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మార్కెట్ ఏరియాలో పర్యటించి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న అక్రమ కట్టడాలను తొలగించనున్నట్లు వ్యాపారస్తులకు తెలిపారు. స్వయంగా తొలగించుకోవాలని సూచించగా, వ్యాపారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో నేరుగా మున్సిపల్ అధికారులు జేసీబీతో అక్రమ కట్టడాల కూల్చివేత పనులు చేపట్టారు. దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో మార్కెట్‌కు వచ్చే ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవద్దని గతంలోనే నోటీసులు ఇచ్చి వాటిని కూలుస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. పండుగ వేళ దుకాణాల వద్ద కూల్చివేతలతో గిరాకీ రాదని, వ్యాపారం దెబ్బతింటుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ కట్టడాల తొలగింపుతో మార్కెట్ ఏరియా విశాలంగా మారడంపై వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన వైద్యం అందిస్తాం

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఐబీ ఆవరణలో ఆసుపత్రి నిర్మించి మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల ప్రజలకు నాణ్యతతో కూడిన ఉచిత వైద్యం అందిస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. స్థానిక ఐబీ ఆవరణలో రూ.300 కోట్ల వ్యయంతో సూపర్ స్పెషాలిటీ, మాతాశిశు ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వ హయాంలో రూ.2కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం రెండంతస్తుల వరకు చేపట్టి నిలిపివేయగా, ఆ నిర్మాణాన్ని కూల్చే పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధునిక సదుపాయాలతో ఆస్పత్రి నిర్మిస్తున్నామని తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద అంతర్జాతీయ స్థాయి ఫిష్‌పాండ్ నిర్మిస్తామని, రూ.27 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణం, క్రిటికల్ కేర్ నిర్మాణ పనులను పూర్తి చేస్తామని అన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మున్సిపల్ చైర్మన్లు రావుల ఉప్పలయ్య, సురిమిల్ల వేణు, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గోదావరి ఒడ్డునే వైకుంఠధామం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కాలేజీరోడ్డులోని గోదావరి సమీపంలో వైకుంఠధామం ని ర్మించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మంచిర్యాల ము న్సిపాలిటీ పరిధి మాతాశిశు ఆరోగ్య కేంద్రం సమీపంలో రూ.4 కోట్లతో వైకుంఠధామం నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐబీ ఆవరణలో నూతనంగా నిర్మించే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మాతాశిశు ఆరో గ్య కేంద్రం నిర్మాణ పనులు పూర్తికాగానే ప్ర స్తుతం ఉన్న ఎంసీహెచ్‌ను శాశ్వతంగా ఐబీకి త రలిస్తామని అన్నారు. వైకుంఠధామం నిర్మాణంతో ఎంసీహెచ్‌కు ఇబ్బందులు తలెత్తకుండానే ముందస్తు చర్యలతో ఆసుపత్రి నిర్మాణం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, కమిషనర్ మారుతిప్రసాద్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కూల్చివేతలు.. శంకుస్థాపనలు



ఆక్రమణల తొలగింపును పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

- 'మంచిర్యాల' అభివృద్ధిపై పీఎస్సార్ ఫోకస్
- జిల్లా కేంద్రంపై ప్రత్యేక దృష్టి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కూల్చివేతలు, శంకుస్థాపనలతో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తనదైన శైలీ ప్రదర్శిస్తున్నారు. జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని ఇచ్చిన హామీ మేరకు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో పట్టణ ప్రధాన మార్కెట్ ఏరియాలో ట్రాఫిక్ ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారించారు. రోజు రోజుకు పెరిగిపోతున్న రద్దీ నేపథ్యంలో రోడ్డుపై ఉన్న ప్రధాన ఆక్రమణలను తొలగించాలని ఇప్పటికే భవన యజమానులకు సూచించారు. గురువారం ప్రధాన మార్కెట్ ఏరియాలో రోడ్డుపైకి వచ్చిన నిర్మాణాలను మున్సిపల్ అధికారులు జేసీబీలతో కూల్చి వేయించారు. కొందరు ఆక్రమణదారులు రోడ్డుపైనా, వ్యాపార సముదాయాల సెల్లార్లలోనూ షాపులు నిర్వహిస్తున్నారు. రోజూ సాయంత్రం వేళల్లో బైక్ కూడా పార్కింగ్ చేసే చోటు ఉండడం లేదు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ ఆక్రమణలు జరుగుతున్నా కూల్చివేతలకు సాహసం చేయలేకపోయారు. ఈ క్రమంలో ఇప్పటికే పలువురు భవన నిర్మాణదారులకు సహకరించాలని నచ్చజెప్పారు. ఇక సర్కారు బాలిక పాఠశాల ప్రహరీకి ఆనుకుని వెలిసిన టేలాలతో సైతం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని అధికారులు గుర్తించారు. దీంతో అక్కడి నుంచి వాటిని తొలగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

మార్కెట్ స్థానంలో ఆసుపత్రి

ఐబీ ఆవరణలో మాతాశిశు సంరక్షణ కేంద్రానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గత సర్కారు హయాంలో ఇక్కడ సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మించాలని రెండు అంతస్తుల స్లాబ్‌ల వరకు నిర్మించారు. ప్రస్తుతం ఆ నిర్మాణాన్ని కూల్చివేశారు. అదే చోట ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు ప్రణాళిక వేశారు. గత నెలలో జిల్లాకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మంజూరైన విషయం తెలిసిందే. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే జిల్లాతోపాటు ఆసిఫాబాద్, మహారాష్ట్ర నుంచి వచ్చే రోగులకు వైద్య సదుపాయం అందే అవకాశం ఉంది. జనరల్ ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది పడాల్సి వస్తోంది. మరోవైపు గోదావరి ఒడ్డున నిర్మించిన మాతాశిశు సంరక్షణ కేంద్రం సైతం వర్షాకాలంలో వరద ముప్పు భయంతో గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులను తరలించాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఐబీ ఆవరణలో నూతనంగా నిర్మించబోయే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో ఒకే చోట మెరుగైన వైద్యం అందే అవకాశం ఉంది.

తీరనున్న 'ఆఖరి' కష్టాలు

ఎన్నో ఏళ్లుగా మంచిర్యాల పట్టణానికి వైకుంఠధామం లేకపోవడంతో గోదావరి ఒడ్డున, ప్రైవేటు భూముల్లోనే ఎవరైన మృతిచెందితే అంత్యక్రియలు చేస్తున్నారు. వర్షాకాలంలో గోదావరి నిండుగా ప్రవహిస్తే, ఒక్కోసారి రోడ్డుపైనే దహన సంస్కారం పూర్తి చేస్తున్నారు. కార్యక్రమాలు నిర్వహించేందుకు కూడా సరైన సౌకర్యాలు ఉండడం లేదు. ఈ క్రమంలో గోదావరి ఒడ్డున ప్రస్తుతమున్న మాతాశిశు సంరక్షణ కేంద్రం పక్కనే రూ.4కోట్లతో వైకుంఠధామానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ వైకుంఠధామం అందుబాటులోకి వస్తే మంచిర్యాల పట్టణవాసులకు ఆఖరి కష్టాలు దూరమయ్యే అవకాశాలున్నాయి.

పట్టణ అభివృద్ధి కోసం పనిచేస్తా

- ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణ అభివృద్ధి కోసం పని చేస్తానని ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్‌రోడ్డులో గురువారం ఉదయం మున్సిపల్ అధికారులు తొలగించిన అక్రమ నిర్మాణాలను ఆయన పరిశీలించి వ్యాపారులతో మాట్లాడారు. కొన్నేళ్లుగా దుకాణదారులు రోడ్లపైకి రావడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, పట్టణ జనాభాకు అనుగుణంగా రోడ్లు వెడల్పు చేయాల్సి ఉంటుందని అన్నారు. కొన్ని కఠిన నిర్ణయాల వల్ల తాత్కాలికంగా కొందరు ఇబ్బందులు ప డుతుంటారని, కాని శాశ్వతంగా ప్రజలు, వ్యాపారులకు మంచి జరుగుతుందని తెలి పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఏ దో ఒకటి మాట్లాడడం సరికాదని, మంచి ర్యాల అభివృద్ధికి ఢిల్లీ నుంచి ఏమి తీసుకువస్తాడో చెబితే తాను కూడా వస్తానని అన్నారు.

శనిగకుంట కేసులో ఏడుగురు అరెస్ట్


- పరారీలో మరో ముగ్గురు
- మంచిర్యాల డీసీపీ భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

చెన్నూర్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ శనిగకుంట మత్తడి పేల్చివేతకు ప్రోత్సహించిన ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత నెల 16న శనిగకుంట మత్తడి పేల్చివేత ఘటనలో అదే నెల 20న పెండ్యాల లక్ష్మీనారాయణ, గోగుల దానయ్య, భీమ్ మధూకర్, రాసమల్ల శ్రీనివాస్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇటీవల ప్రధాన నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారణ చేశారు. శనిగకుంట సమీపంలోని 15.20 ఎకరాలు గోదావరిఖనికి చెందిన చెరుకు బుచ్చిరెడ్డి వద్ద చెన్నూర్‌కు చెందిన నడిపల్లి లక్ష్మణ్‌రావు, మంచాల రాజబాపు, పెద్దింటి శ్రీనివాస్, లక్కం రాజబాపు, పోగుల శేఖర్, ఇప్ప సంపత్, ఉమేశ్ గిల్డా, బత్తుల సమ్మయ్య, రాంలాల్‌గిల్డా, ఎన్నం బానయ్య 2022 ఫిబ్రవరి 22న కొనుగోలు చేశారు. ఈ భూమిని చెన్నూర్‌కు చెందిన గొడిసెల బాపురెడ్డికి విక్రయించేందుకు రూ.7.50 కోట్లకు ఒప్పందం చేసుకున్నారు. బాపురెడ్డి రూ.4 కోట్లు చెల్లించాడు. నాలుగెకరాలు మాత్రమే బాపురెడ్డి కుమారుడు ప్రవీణ్‌రెడ్డి పేరున రిజిస్ట్రేషన్ చేశారు. మరో 11.20 ఎకరాలు శనిగకుంట ఎఫ్‌టీఎల్‌లో ఉండడంతో రిజిస్ట్రేషన్ కాలేదు. చెరువు నిండి భూమిలోకి నీళ్లు రావడంతో బాపురెడ్డి తనకు భూమి వద్దని, డబ్బులు ఇవ్వాలని సదరు వ్యక్తులపై ఒత్తిడి తెచ్చాడు. నీరు రాకుండా మట్టి పోయిడంతో ఇరిగేషన్ డీఈ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని నోటీసులు జారీ చేశారు. దీంతో పట్టాదారులు బత్తుల సమ్మయ్య ఆధ్వర్యంలో మంచాల రాజబాపు, రాంలాల్‌గిల్డా, నడిపల్లి లక్ష్మణ్‌రావు, లక్కం రాజబాపు, పెద్దింటి శ్రీనివాస్, పోగుల శేఖర్, ఎన్నం బానయ్య, ఇప్ప సంపత్, ఉమేశ్ గిల్డాలు ఈ సమస్య నుంచి బయట పడాలని నిర్ణయించుకున్నారు. పెండ్యాల లక్ష్మీనారాయణ, భీమ్ మధూకర్‌లను కలిసి చెరువు మత్తడి కూల్చివేస్తే రూ.4లక్షలు ఇస్తామని ఒప్పందం చేసుకుని రూ.లక్ష అడ్వాన్స్‌గా ఇచ్చారు. పేలుడు పదార్థాలు వినియోగించి మత్తడిని పేల్చివేశారు. ఏడుగురిని అరెస్టు చేయగా, బత్తుల సమ్మయ్య, రాంలాల్‌గిల్డా, ఎన్నం బానయ్య పరారీలో ఉన్నారని డీసీపీ తెలిపారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, ఎస్సైలు సుబ్బారావు, శ్వేత, కానిస్టేబుళ్లు రాజశేఖర్, భూమన్నలను అభినందించారు.

ఎస్టీపీపీకి మరో అవార్డు



అవార్డు అందుకుంటున్న డైరెక్టర్ సత్యనారాయణ, ప్రభాకర్‌రావు

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ)ను మరో అవార్డు వరించింది. థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణలో దేశస్థాయిలో రికార్డులు సాధిస్తూ వరుసగా అవార్డులు అందుకుంటోంది. జాతీయ పవర్ జనరేషన్ లీడర్‌షిప్ అవార్డ్స్–2024 కార్యక్రమంలో సింగరేణి పవర్ సెక్టార్‌లో మరో రెండు అవార్డులు అందుకుంది. 500మెగావాట్లకు పైగా ఉన్న పవర్ ప్లాంటులో ఎస్టీపీపీకి బెస్ట్ నేషనల్ పవర్ జనరేషన్ ఎక్సలెన్స్ యూనిట్ అవార్డు, డైరెక్టర్ సత్యనారాయణరావుకు ప్రతిష్టాత్మక లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వచ్చాయి. ఈ మేరకు ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులు అందుకున్నారు. సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం డైరెక్టర్ సత్యనారాయణరావు బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్కూరి లక్ష్మీ గార్డెన్ సమీపంలో గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. మృతునికి సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని, కొన్నిరోజులుగా ఆయాప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్నాడన్నారు. అనారోగ్యం బారిన పడి మృతి చెంది ఉంటాడన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించామని, సంబంధీకులు ఉంటే 87126 59925 నంబరులో సంప్రదించాలన్నారు.

మహిళను వేధించిన వ్యక్తికి రెండు నెలల జైలు

కడెం: మహిళను వేధించిన వ్యక్తికి రెండు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ ఖానాపూర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జితిన్‌కుమార్ గురువారం తీర్పునిచ్చారు. కడెం ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, కోర్టు డ్యూటీ ఆఫీసర్ నర్సింహ కథనం ప్రకారం.. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన తక్కళ్లపెల్లి గణేశ్ తనను వేధిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన ఓ మహిళ 2015లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదుచేసిన పోలీసులు విచరణ జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఖానాపూర్ కోర్టులో ఏపీపీ దేవేందర్ సాక్షులను హాజపర్చగా నేరం రుజువు కావడంతో మేజిస్ట్రేట్ జైలు శిక్ష, జరిమనా విధించారు.

మట్టి తరలిస్తున్న ఇద్దరిపై కేసు

భీమారం: మండల కేంద్రంలోని రైతువేదిక సమీపంలో ప్రభుత్వ భూముల నుంచి మట్టి తరలించిన మెండె పున్నం(జేసీబీ యజమాని), బొల్లం శ్రీనివాస్(ట్రాక్టర్ల యజమాని)లపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాములు తెలిపారు. రెండు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నామని, జేసీబీ కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు. కొంతకాలంగా ప్రభుత్వ భూ ముల నుంచి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నారని తహసీల్దార్ సదానందం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మైనింగ్ శాఖ అనుమతితోనే మట్టి తరలించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

75 కిలోమీటర్లు కాలినడకన...


మహోర్ నుంచి వస్తున్న గిరిజనులు

తాంసి(బోథ్): ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని శాంతినగర్ వాసులు మూడేళ్లుగా తమ గ్రామంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శారదాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. ఇందులో భాగంగా మండపంలో వెలిగించే అఖండజ్యోతి కోసం 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహారాష్ట్రలోని మహోర్ దేవస్థానం నుంచి కాకడ హారతి తీసుకొచ్చారు. గురువారం వేకువజామున మహోర్ రేణుకామాత దర్శనం చేసుకుని కాకడ హారతి చేతపట్టుకుని కాలినడకన రాత్రి గ్రామానికి చేరుకున్నారు. కొలాం గిరిజనులు ఆచారం ప్రకారం పూజలు నిర్వహించి అఖండ జ్యోతి వెలిగించారు. గ్రామస్తులపై రేణుకామాత అనుగ్రహం ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని మొదటిసారిగా కాలినడకన వెళ్లి కాకడ హారతి తీసుకొచ్చినట్లు గ్రామ పెద్ద దిలీప్ తెలిపారు.

మాకు స్వేచ్ఛనీయండి

జన్నారం: దట్టమైన అడవుల్లో స్వేచ్ఛగా బతకాలనుకుంటాం.. మేము ఎవరికీ హాని చేయం..అడవితల్లి ఒడిలో అలరాడుతుంటే కొందరు స్వార్థపరులు మాకు ఉచ్చులు బిగుస్తున్నారు.. బరిసెలతో పొడిచి, కరెంటు పెట్టి, మందు ప్రయోగాలు వంటి దుశ్చర్యలకు పాల్పడు తూ మమ్మల్ని హత మారుస్తున్నారు. మా మాంసాన్ని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. మా కోసం అనేక చట్టాలున్నా అవి వారికి చుట్టా లుగానే మారుతున్నాయట..మా బాధలను గుర్తించి రక్షణ కల్పించండి.. అక్టోబర్ 2 నుంచి 8 వరకు నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా మిమ్ములను వేడుకుంటున్నాం.

– ఇట్లు..మీ వన్యప్రాణి


కుంటలో నీరు తాగుతున్న నీలుగాయిలు (ఫైల్)

- వన్యప్రాణుల సంరక్షణకు అనేక చట్టాలు
- కవ్వాల్..వన్యప్రాణుల కలయిక
- కొనసాగుతున్న వన్యప్రాణి వారోత్సవాలు

రక్షణ కవచంలా..

దట్టమైన అడవిగా కవ్వాల్ అభయారణ్యం విస్తరించింది. 1965లో వన్యప్రాణుల విభాగంగా(వైల్డ్‌లైఫ్)గా ఏర్పాటు చేశారు. 1972లో వన్యప్రాణుల సంరక్షణ చట్టం అమలైంది. 2012లో నేషనల్ టైగర్ అథారిటీ, కేంద్రప్రభుత్వం కవ్వాల్ అభయారణ్యాన్ని పులుల రక్షిత ప్రదేశం (టైగర్‌జోన్)గా ఏర్పాటు చేసింది. ఈ అభయారణ్యం 2,015 స్క్వేర్ కి.మీ వైశాల్యంతో ఉంది. 893 చదరపు కి.మీ. కోర్ ఏరియా, 1123 చదరపు కి.మీ. బఫర్ ఏరియాగా గు ర్తించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా టైగర్‌జోన్ వ్యాపించి ఉంది. చుక్కల దుప్పి, నీలుగాయిలు,


అడవిలో ఏర్పాటు చేసిన నీటికుంట

దుప్పులు, సాంబర్లు, కొండగొర్రెలు, జింకలు, కుందేళ్లు, ముళ్లపంది తదితర వాటితోపాటు పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు వన్యమృగాలు స్వేచ్ఛగా జీవించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ టైగర్‌జోన్ ఏర్పాటు నుంచి వన్యప్రాణులకు రక్షణ కవచంగా మారింది. కఠిన చట్టాల అమలుతో వన్యప్రాణుల వేట తగ్గుముఖం పట్టింది.

డివిజన్‌లో సౌకర్యాలు..

జన్నారం అటవీ డివిజన్‌లో వన్యప్రాణుల సంరక్షణకు అధికారులు సౌకర్యాలు కల్పిస్తున్నారు. 40


వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన గడ్డిక్షేత్రాలు

బీట్లలో గడ్డి క్షేత్రాలను విరివిగా ఏర్పాటు చేశారు. నీటి కుంటలు, అవాసానికి అనువుగా ఏర్పాట్లు చేస్తున్నారు. గత మూడేళ్లుగా అడవుల్లోకి పశువులు వెళ్లకుండా కట్టడి చేశారు. అలజడి లేకపోవడంతో వన్యప్రాణులు స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉంది. ఇందుకుతోడు ఆహారం కోసం వివిధ రకాల గడ్డి పెంచడం, నీటి కుంటల నిర్మాణం, అలజడి లేకుండా అవాసం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. గతంతో పోలిస్తే వన్యప్రాణుల సంఖ్య రెట్టింపయినట్లు అధికారులు తెలిపారు.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు



వన్యప్రాణుల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అడవిలో గడ్డిక్షేత్రాలు, నీటి సౌకర్యం కల్పిస్తున్నాం. గతంతో పోలిస్తే వన్యప్రాణుల సంఖ్య పెరిగింది. వేట కూడా తగ్గింది. వన్యప్రాణుల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా వివిధ కార్యక్రమాలు చేపడుతాం.

– శివ్ ఆశిష్‌సింగ్, జిల్లా అటవీ అధికారి

కఠిన చట్టాలు..

వన్యప్రాణులను వేటాడినా, వాహనంతో ఢీకొట్టి చంపినా కఠిన చట్టాలున్నాయి. 1972 యాక్ట్ ప్రకారం 6 నెలల నుంచి 8 ఏళ్ల వరకు జైలు శిక్ష తోపాటు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు జరిమానా ఉంది. షెడ్యూల్ 1 కిందికి వచ్చేపులి, చిరుత, ఎలుగుబంటి, లాంటి అంతరిస్తున్న జంతువులను వేటాడితే 8 ఏళ్ల జైలు శిక్ష ఉంటుంది. షెడ్యూల్ 2 కిందికి వచ్చే మిగతా జంతువుల వేటాడి చంపితే 6 నెలల నుంచి 7 ఏళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

మొదలైన వారోత్సవాలు

ఈ నెల 2 నుంచి 7 వరకు 70వ వన్యప్రాణి వారోత్సవాలను డీఎఫ్‌వో శివ్ ఆశిష్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అవగాహన ర్యాలీ, ఫుట్ పెట్రోలింగ్, విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు అవగాహన కార్యక్రమం, బైక్‌ర్యాలీ నిర్వహించనున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు


పట్టుబడ్డ నిందితులతో ఎస్సై సుగుణాకర్

నస్పూర్: పట్టణ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను సీసీసీ నస్పూర్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై నెల్కి సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. తీగల్‌పహాడ్‌లోని క్రషర్ మిల్ సమీపంలో ఏడుగురు వ్యక్తులు గంజాయికి అలవాటుపడి భద్రాచలం నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అందరూ పంచుకోవడానికి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ముగ్గురు నిందితులను పట్టుకోగా.. మరో నలుగురు పారిపోయారు. పట్టుబడ్డ గోదారి రాజు, జాడి వంశి, సాయికుమార్ నుంచి 1.5 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గని మేనేజర్‌పై కేసు నమోదు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5 గని మేనేజర్ అబ్దుల్‌ఖదీర్‌పై శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. గనిలో పని చేస్తున్న జనరల్ మజ్దూర్ కార్మికుడు దేవి శ్రీనాథ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గని మేనేజర్ వద్దకు వెళ్లి తనకు ఫ్యాన్ ఆపరేటర్ పని ఇవ్వాలని కోరగా అందుకు ఆయన నిరాకరించడంతోపాటు కులం పేరుతో దూషించడానికి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆగని భూ ఆక్రమణలు..!

- ఆక్రమిత ప్రభుత్వ భూముల్లో బోర్డుల ఏర్పాటు
- బేఖాతర్ చేస్తున్న అక్రమార్కులు

బెల్లంపల్లి: రెవెన్యూ డివిజన్ కేంద్రం బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతూనే ఉన్నాయి. రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నా అక్రమార్కులు బేఖాతర్ చేస్తున్నారు. గత శుక్రవారం కాల్‌టెక్స్ ఏరియా 12, 13వ మున్సిపల్ వార్డుల మధ్యలో కబ్జాకు యత్నించగా.. సర్వేనంబర్ 104లోని ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆక్రమణదారులు చట్టరీత్యా శిక్షార్హులని పేర్కొన్నారు. అదేమీ లెక్క చేయకుండా హెచ్చరిక బోర్డును ఆనుకుని రాత్రికి రాత్రే షెడ్డు నిర్మించడం సంచలనం సృష్టించింది. ఆ స్థలం హైకోర్టు పరిధిలో ఉందని, అడ్డుకునే చర్యలకు పాల్పడితే కోర్టు ధిక్కరణకు గురవుతారని ప్రతి బోర్డును ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. అంబేద్కర్‌నగర్ ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఓ శాశ్వత కట్టడాన్ని కూల్చివేశారు. ఇప్పటికే ఎంతో విలువైన ప్రభుత్వ భూము


కాల్‌టెక్స్‌లోని ప్రభుత్వ భూమిలో పాతిన బోర్డు

లను కబ్జా చేశారు. మిగిలిన కొద్దిపాటి భూములపైనా కన్నేసి వదలకుండా ఆక్రమణకు తెగబడుతున్నారు. కాల్‌టెక్స్ ఏరియా, గంగారాం నగర్, కన్నాల, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూముల ఆక్రమణకు అక్రమార్కులు చేయని ప్రయత్నం లేదు. గతంలో కన్నాల శివారు జాతీయరహదారి పక్కన అప్పటి ఆర్డీవో ఆయేషా మస్రత్ ఖానమ్, బెల్లంపల్లి తహసీల్దార్ శ్యామలదేవి ప్రభుత్వ భూమిగా నిర్ధారించి జేసీబీ, ట్రాక్టర్‌లతో దగ్గరుండి కూల్చివేయించారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా భూ కబ్జా ఆగకపోవడాన్ని పుర ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. సింగరేణి ఏరియా ఆసుపత్రి ముందు, అంబేద్కర్‌నగర్, రాంనగర్, అశోక్‌నగర్, బూడిదగడ్డ బస్తీ, షంషీర్ నగర్, మహ్మద్ ఖాశీంబస్తీ, బెల్లంపల్లి బస్తీ, కాంటా చౌరస్తా, కన్నాల బస్తీ, కొత్త బస్టాండ్ ఏరియా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన తదితర ప్రాంతాల్లో పాతిన హెచ్చరిక బోర్డులు పత్తా లేకుండా పోయాయి. భూ ఆక్రమణల వెనుక ప్రభుత్వ అధికారుల హస్తం ఉందనే విమర్శలు ఉన్నాయి. గతంలో ఇక్కడ పని చేసిన పలువురు లోపాయికారిగా వ్యవహరించారనే అపవాదు ఉంది. ప్రస్తుతం పని చేస్తున్న కొందరు అదే తీరుగా సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

నిర్మల్‌లో నిషేధిత మత్తుపదార్థాల పట్టివేత

- పక్కా సమాచారంతో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడులు
- భారీగా క్లోరాల్ హైడ్రేట్, అల్ప్రాజోలం పట్టివేత
- వీటి విలువ రూ.43 లక్షలు ఉంటుందని అంచనా

నిర్మల్ టౌన్: నిర్మల్ పట్టణంలో నిషేధిత మత్తు పదార్థాలను ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం పట్టుకున్నారు. పక్కా సమాచారంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పట్టణంలోని ద్వారకానగర్‌కు చెందిన గంధం శ్రీనివాస్ గౌడ్ ఇంటిపై దాడులు చేశారు. 3.3 కిలోల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నారు. అతడిని వి చారణ చేయగా ఇచ్చిన సమాచారంతో శాంతినగర్‌కాలనీలోని ఓ ఇంట్లో బస్తాలలో నిల్వ ఉంచిన 728 కిలోల క్లోరాల్ హైడ్రేట్‌ను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని సోలాపూర్ శ్రీను అల్ప్రాజోలంను రాజస్థాన్‌లోని రూప్‌సింగ్ వద్ద కొనుగోలు చేసి దిగుమతి చేసుకున్నట్లు తెలిపారు. ఈ అల్ప్రాజోలం 10 గ్రాములతో 100 పెట్టెల కల్తీ కల్లు తయారు చేయవచ్చ


క్లోరల్ హైడ్రేడ్ స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

ని తెలిపారు. కిలో అల్ప్రాజోలం విలువ సుమా రు రూ.10 లక్షలకుపైగా ఉంటుందని తెలిపారు. సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు మాట్లాడుతూ.. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల విలువ రూ.43 లక్షలు ఉంటుందని వెల్ల డించారు. ఈమేర కు శ్రీనివాస్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలి పారు. గతంలో శ్రీనివాస్‌గౌడ్‌పై ఏడు కేసులు ఉన్నాయని, పీడీయాక్టు కూడా నమోదైందని వెల్లడించారు. దాడుల్లో స్టేట్ ఎక్సైజ్ ఎస్సై బాలరాజు, సీఐ లక్ష్మణ్ రావు, ఎస్సై వసంతరావు, అభిషేక్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

సోన్:మండలంలోని న్యూబొప్పారం గ్రామానికి చెందిన శివరాత్రి రవి(33) గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రవి కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం ఉదయం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఇంటివెనుకాల ఉన్న రేకుల షెడ్డులోకి వెళ్లి చీరతో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు మధ్యాహ్నం వెళ్లి చూడగా చనిపోయి ఉన్నాడు పోలీసులకు సమచారం అందించగా ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రవికి భార్య, కూతురు, ఏడాది వయసున్న కొడుకు ఉన్నాడు. రవి తండ్రి పోశెట్టి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తాహెర్‌ఖాన్ తెలిపారు.

లింబా(కే)లో..


రమేశ్(ఫైల్)

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన బొరిగాం రమేశ్(42) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై భాస్కరాచారి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. రమేశ్ మద్యానికి బానిసై ఇంటి పక్కన ఉన్న రేకుల షెడ్డులో దూలానికి ఉరివేసుకున్నాడు. రమేశ్ భార్య సంతోషి ఫిర్యాదు మేరకు పంచానామా చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా రవీందర్‌రావు



కైలాస్‌నగర్: రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌గా ఎం.రవీందర్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు రిజి స్ట్రార్‌గా పనిచేసిన అశోక్ కుమార్‌ను మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు బదిలీ చేసిన ప్రభుత్వం ఆ స్థానంలో హైదరాబాద్ దక్షిణ డీఆర్‌గా ఉన్న రవీందర్‌రావును నియమించింది. కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు.

జాతీయస్థాయికి ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు విద్యార్థులు జాతీయస్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు గురువారం తెలిపారు. సెప్టెంబర్ 15 నుంచి 17 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో చెన్నూర్ మండలానికి చెందిన రఘు, కౌటాల మండలానికి చెందిన యోగి, కార్తీక్, ఆసిఫాబాద్ మండలానికి చెందిన సాయి ఉత్తమ ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 3 నుంచి 7 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని వెల్లడించారు.

మహిళపై దాడి

తిర్యాణి(ఆసిఫాబాద్): హత్య చేయాలనే ఉద్దేశంతో ఓ వ్యక్తి మహిళపై దాడి చేసి గాయపర్చాడు. ఎస్సై మాధవ్‌గౌడ్, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. తిర్యాణి మండలం సుంగాపూర్ పరిధిలోని దానపూర్‌కు చెందిన టీకం మారుబాయి గ్రామ శివారులో కంది, పెసర్లు సాగు చేస్తోంది. భర్త మారుతో కలిసి చేను వద్దే గుడిసె ఏర్పాటు చేసుకుని ఉంటుంది. గురువారం ఉదయం చేను వద్ద ఉన్న మారుబాయిపై అదే గ్రామానికి చెందిన ఆత్రం రాజు కొడవలితో దాడి చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. వెంటనే తన వద్ద ఉన్న బాడిషా(గొడ్డలి వంటి పదునైన ఆయుధం)తో తలపై దాడి చేశాడు. గాయపడిన మారుబాయి అపస్మారక స్థితికి చేరుకుంది. అనంతరం రాజు ఘటనాస్థలి నుంచి పారిపోయాడు. అక్కడికి చేరుకున్న ఆమె భర్త.. మారుబాయిని స్థానికుల సాయంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన రాజు ఆచూకీ ఇప్పటివరకు దొరకలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భైంసారూరల్: మండలంలోని సుంక్లి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సిరిపూర్ నితీశ్‌కుమార్(22) చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. బీహార్‌కు చెందిన నితీశ్‌కుమార్ తన తమ్ముడు కరణ్‌కుమార్ కొంత కాలంలో సుంక్లి సమీపంలోని సిరిమల్లె మహేశ్ రైస్‌మిల్లులో కార్మికులుగా పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి వంట సామగ్రి కోసం ద్విచక్రవాహనంపై వానల్‌పాడ్ గ్రామానికి వెళ్తుండగా మూలమలుపు వద్ద అదుపుతప్పి కిందపడ్డారు. వాహనం నడుపుతున్న నితీశ్‌కుమార్‌కు తీవ్రగాయాలు కాగా, వెనకాల కూర్చున్న కరణ్‌కుమార్ స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులన్ని 108 అంబులెన్సులో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సూచన మేరకు నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఒకరు..


సైదుల సాగర్(ఫైల్)

కోటపల్లి: మండల కేంద్రానికి చెందిన సైదుల సాగర్ (28) ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సాగర్ గురువారం ఉదయం షట్‌పల్లి గ్రామానికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా షట్‌పల్లి గ్రామ సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే చనిపోయాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజేందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాపల్ సమీపంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో రాంటెంకి రాజేష్(20) మృతిచెందాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమారం మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన రాజేష్ తన స్నేహితుడు నాగరాజుతో కలిసి తాండూర్ మండలం బోయపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నారు. స్థానిక అంగడి బజార్ సర్వీస్ రోడ్డు వద్ద వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. దీంతో బైక్ వెనుకాల కూర్చున్న రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 ద్వారా బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. రాజేష్ తండ్రి పోషం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ

జన్నారం: మోటార్‌సైకిల్‌పై వచ్చిన దుండుగుడు ఓ మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన గురువారం జన్నారం పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్నూర్ మండలం దంతెనపల్లికి చెందిన చింతకింది రమ గురువారం జన్నారం మండలం దేవునిగూడలోని తన తల్లి ఇంటికి భర్తతో కలిసి వచ్చింది. పక్కింటి వారితో మాట్లాడుతుండగా మోటార్‌సైకిల్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి పుస్తెల తాడును లాక్కెళ్లాడు. గమనించిన భర్త, చుట్టుపక్కల వారు వెంబడించినా తప్పించుకుని పారిపోయాడు. ఎస్సై రాజవర్ధన్ ఆధ్వర్యంలో రెండు బృందాలు నిందితుడి కోసం గాలిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా నిందితుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. నిందితుడు దస్తురాబాద్ మండలం వైపు పారిపోయినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేరుకే 24గంటలు.. గర్భిణికి అందని వైద్యం

వేమనపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యంలో 24గంటలూ వైద్యం అందించాల్సి ఉన్నా గర్భిణికి వైద్యం అందకుండా పోయింది. సిబ్బంది ఎవరూ లేకపోవడంతో అంబులెన్స్‌లో 30కిలోమీటర్ల దూరంలోని చెన్నూర్ సివిల్ ఆస్పత్రికి తరలించాల్సి వచ్చింది. మండలంలోని గొర్లపల్లి కొత్తకాలనీకి చెందిన బోరుకూటి స్వరూప ఆరు నెలల గర్భంతో ఉంది. మండలంలోని జాజులపేటలో ఉన్న తల్లిగారింటికి వెళ్లింది. గురువారం సాయంత్రం 5గంటలకు ఆమె కడుపునొప్పితో బాధపడుతూ స్థానిక పీహెచ్‌సీకి వచ్చింది. ఆయమ్మ నిర్మల బీపీ పరీక్షించగా... కాంటింజెంట్ వర్కర్ బాపు వైద్యాధికారి రాజేష్‌కు సమాచారం అందించాడు. ఆయన సూచన మేరకు ఓ గోళి


అంబులెన్స్‌లో వైద్యం చేస్తున్న అంబులెన్స్ సిబ్బంది

ఇచ్చారు. బుధవారం రోజునే ముగ్గురు స్టాఫ్‌నర్సులు విధుల్లో చేరారు. ఆస్పత్రిలో ఎవరూ లేకపోవడంతో రెండు గంటలు వేచి చూసిన గర్భిణిని కుటుంబ సభ్యులు చెన్నూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు.

సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బెల్లంపల్లిరూరల్: రైతులు పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో అనేక లాభాలు గడించవచ్చని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ కోట శివకృష్ణ, పొలాస(జగిత్యాల) వ్యవసాయ కళాశాల విద్యార్థులు అన్నారు. గురువారం బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామంలో గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సు నిర్వహించారు. కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ నాలుగో సంవత్సరం విద్యార్థులు భూభాగ పటం, సామాజిక వనరుల పటం, నేల రకాలుతోపాటు ఇతర అంశాలపై నేలపై చిత్రాలు గీసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు తిరుపతి, శ్రీధర్, నరేష్, మణిదీప్, నవ


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తేజ్, పవన్, మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రేమ్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్త తిరుపతి, ఏఈవోలు తిరుపతి, శంకర్, రాంచందర్ పాల్గొన్నారు.

మేళాకు తరలిన మహిళా సంఘాల సభ్యులు


హాజరైన సభ్యులు, అధికారులు

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో సరస్ మేళా(సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిజన్స్ సొసైటీ)కు మంచిర్యాల నుంచి స్వయం సహాయక సంఘాల సభ్యులు 90 మంది గురువారం తరలి వెళ్లారు. దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన కళాకారులు, వృత్తి పని వారు తయారు చేసిన 200 రకాల కళాఖండాలు, వస్తువుల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాజేశ్వరీ, అడిషనల్ డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు, డీపీఎంలు వేణు, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ముందుకు రావాలి

కాసిపేట: వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు యువత ముందుకు రావాలని అటవీ శాఖ డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్ సూచించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, ఎఫ్‌బీఓ శ్రీధర్, లెక్చరర్లు సురేష్, వెంకటస్వామి, అంజనిప్రసాద్, రమేష్, చిరంజీవి, చంద్రశేఖర్, భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.